యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా రమణ
రాష్ట్ర కార్యవర్గంలో నలుగురికి చోటు

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గంలో చిత్తూరు జిల్లా నుండి నలుగురికి అవకాశం కల్పించారు. యుటిఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ విద్యా వైజ్ఞానిక మహాసభలు, కాకినాడలో జనవరి 5-8 తేదీల్లో వైభవంగా జరిగాయి. మొదటి రెండు రోజులు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన 20వేల మంది ఉపాధ్యాయులతోనూ, తరువాత రెండురోజులు 2,200 మంది ప్రతినిధులతోనూ ఉపాధ్యాయుల సమస్యలపై మేధోమథనం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, జీవో 117 రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితంచేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ప్రధాన తీర్మానాలను చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా జీవి రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎం.సోమశేఖర్‌నాయుడు, ఎన్.మణిగండన్, కె.దీనావతిని ఎన్నుకున్నారు.

'వైకుంఠుని' చెంత... మృత్యుఘోష

- ఆరుగురు భక్తులు దుర్మరణం
- 50 మందికి పైనే అస్వస్థత
- నేడు తిరుపతికి రానున్న చంద్రబాబు
- తక్షణమే టోకెన్ల జారీకి టిటిడి నిర్ణయం
- ఏర్పాట్ల లోపంపై మండిపడ్డ భక్తులు
- రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలన్న సిపిఎం

తొక్కిసలాటలో మృతిచెందిన వారిలో రజిని (47), శాంతి (40), మల్లిక (50), రాజేశ్వరి, నాయుడుబాబు (41),లావణ్య (37) ఉన్నారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి : వి.నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరపాలి. ఆరుగురు మృతిచెందడంపై సిపిఎం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. టోకెన్ల జారీ కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చేయడంలో టిటిడి వైఫల్యం వల్లే భక్తుల మృతికి కారణమయ్యింది. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి. కుటుంబంలో ఒకరికి టిటిడిలో పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలి.

40 మందికి గాయాలు : కలెక్టర్

తొక్కిసలాటలో 40 మంది గాయపడ్డారని, 28 మందిని రుయాకు, 12 మందిని స్విమ్స్ ఆస్పత్రికి తరలించారు. రుయాలో చికిత్స పందుతున్న 28 మందిలో నలుగురు మృతిచెందారు. స్విమ్స్‌లో ఇద్దరు మృతిచెందారు. మృతిచెందిన వారిలో ఐదుగురు మహిళలు, ఒకరు పురుషుడు ఉన్నారు. ఇరువురిని మాత్రమే గుర్తించడం జరిగింది.

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, తిరుమల, తిరుపతి సిటి

'వైకుంఠ ద్వార దర్శనం చేసుకుంటే పుణ్యం వస్తుంది' అన్న భక్తుల సెంటిమెంట్.. టిటిడి యాజమాన్య నిర్లక్ష్య ధోరణితో ఆరుగురు భక్తుల దుర్మరణానికి కారణమయ్యింది.. సేలంకు చెందిన మల్లిక (52), నర్సీపట్నంకు చెందిన నాయుడుబాబు (50) మృతిచెందారని మాత్రమే ప్రస్తుతానికి సమాచారం. మృతుల్లో ఐదుగురు మహిళలు కాగా, ఒకరు పురుషులు ఉన్నారు. తిరుపతిలో పక్కా ప్రణాళికతో ఎనిమిది కౌంటర్లను వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం ఏర్పాటు చేశామని టిటిడి చెబుతున్నా సౌకర్యాల లేమి, రద్దీ నియంత్రణ లేకపోవడంతో క్యూలైన్లలో తొక్కిసలాట చోటు చేసుకుంది. బుధవారం రాత్రి 9 గంటల పైన తిరుపతి అంతా గందరగోళంగా మారింది. క్యూలైన్లలో అస్వస్థతకు గురైన వారిని 'కుయ్ కుయ్'మంటూ అంబులెన్స్‌ల్లో తరలించారు. దాదాపు 50 మందిపైనే తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని స్విమ్స్, రుయాలకు తరలించి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే టిటిడి ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయుడు, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్ రుయాకు చేరుకుని అస్వస్థతకు గురైన వారికి మెరుగైన చికిత్స అందించే ప్రయత్నం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఈ ఘటనలపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు ఫోన్‌లో అధికారులను ఆరా తీస్తూ, బుధవారం బాధితులను పరామర్శించేందుకు రానున్నట్లు వెల్లడించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. తక్షణమే టోకెన్ల జారీకి టిటిడి అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో టోకెన్ల జారీ ప్రారంభించామని టిటిడి ఈవో తెలిపారు. రద్దీని అదుపు చేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. అన్ని కేంద్రాల వద్దకు అదనపు బలగాలను తరలించారు. . సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, నాయకులు వేణు, బుజ్జి తదితరులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. ఘటన పునరావృతం కాకుండా యుద్ధప్రాతిపదికన భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించేందుకు క్యూలైన్లు తెరిచారు. టోకెన్లు జారీ చేసేందుకు క్యూలైన్లు ఓపెన్ చేశారని భక్తులు దూసుకురావడంతో తొక్కిసలాట జరిగినట్లు సమాచారం.

ప్రభుత్వ వైఫల్యం వల్లే తొక్కిసలాట : భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ

చిత్తశుద్ధి లేని వ్యక్తులకు, వివాదాస్పద వ్యక్తులకు టిటిడి పగ్గాలు ఇచ్చారని, టిటిడిని రాజకీయ కేంద్రంగా మార్చారని, భక్తుల ప్రయోజనాలకు గాలికి వదిలేశారని మాజీ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి విమర్శించారు. తొక్కిసలాట ఘటనలో ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందన్నారు. గడిచిన ఐదేళ్లలో ఎపుడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. టిటిడి చరిత్రలో ఇది చీకటి రోజన్నారు.

ఏర్పాట్లు శూన్యం : లక్ష్మణరావు, కాకినాడ

పత్రికల్లో, మీడియాలో టిటిడి ఊదరగొట్టింది. తిరుమల రావద్దు.. తిరుపతిలో 8చోట్ల కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నాం తీసుకోమని చెప్పింది. ఎంఆర్‌పల్లి, జీవకోన, అలిపిరి వద్ద భక్తులు ఉండడంతో బైరాగిపట్టెడ రామానాయుడు స్కూలు వద్దకు వచ్చాం. అప్పటికే రష్ ఎక్కువగా ఉంది. స్థానికులతో పాటు నాన్‌లోకల్ వాళ్లం కలిసిపోయాం. టిటిడి భక్తుల కోసం కాఫీ, టీ, మజ్జిగ, పాలు, అన్నప్రసాదాలు పెడుతుందని అనుకున్నాం. ఏమీ పెట్టలేదు. లోపల మమ్మల్ని వేసేసి బయటకు పోనీకుండా చేశారు. ఉక్కపోత. దర్శనం వద్దనుకుని బయటకు వెళ్లాలనుకున్నా పంపించలేదు. ఈ ఘటన జరిగిన తరువాత ప్రశాంతత లేదు. రాత్రి 10కల్లా క్లోజ్ అని చెబుతున్నారు. ఇంత దూరం నుంచి వచ్చి శ్రీవారిని దర్శించుకోకపోతే వెలితిగా ఉంటుంది.

ఉదయం అనగా వచ్చాం : మాలతి,తాడిపత్రి, అనంతపురం జిల్లా

ఉదయం అనగా వచ్చాం. రాత్రంతా ప్రయాణం చేసి అలిసిపోయాం. అయినా స్వామిపైన భక్తితో శ్రీవారిని చూసుకోవాలని క్యూలైన్లలో వేచి ఉన్నాం. అయితే క్యూలైన్లలో ఏర్పాట్లు సరిగ్గా లేవు. పోలీసులు కసురుకుంటున్నారు. వైకుంఠ ఏకాదశి రోజు శ్రీవారిని దర్శించుకుంటే మంచి జరుగుతుందన్న నమ్మకంతో ఏడుగురం ఆధార్ కార్డులతో సహా క్యూలైన్లలో నిలబడ్డాం. తొక్కిసలాట, ఉక్కపోత ఉంది. చలికాలంలో ఉక్కపోత ఏంటా? అని అనుకున్నాం.ఆరుగురు చనిపోయాక ఫ్రీగా ఇప్పుడు వదులుతున్నారు.

కరువు..నిజమే..!

కేంద్ర బృందం నిర్ధారణ

కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తాం

'ప్రత్యామ్నాయం' సాగు చేయాలని హితవు

ప్రజాశక్తి - యాదమరి (చిత్తూరు జిల్లా)

ఖరీఫ్‌లో రైతులు పంట నష్టపోయింది నిజమేనని కేంద్ర బృందం నిర్ధారణకు వచ్చింది. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ సభ్యులు బుధవారం యాదమరి మండలం కోనాపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట పొలాలను పరిశీలించారు. 2024 ఖరీఫ్‌లో వేరుశనగ పంట సాగు చేసిన రైతుల పొలాలను సందర్శించారు. కోనాపల్లి గ్రామంలోని తంగమణి సాగు చేసిన కంది పంటను చూశారు. వేరుశనగ పూర్తిగా నష్టపోవడంతో, అంతర పంటగా వేసిన కంది పంటైనా చేతికి వస్తుందని ఆశగా చూశామని, పూత వచ్చే సమయంలో అడపాదడపా వర్షాలు పడడంతో కాయ పురుగు పట్టిందన్నారు. వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎంత పంట సాగు చేశారు. ఎంత పెట్టుబడి పెట్టారు, ఎంత దిగుబడి వచ్చింది అని తెలుసుకున్నారు. చిట్టిబాబు పొలంలో వేరుశనగ పంట చేతికి రాకపోవడంతో తీగలను సైతం పొలంలోనే వదిలేశానని వాపోయాడు. ఎకరాకు 25వేలు ఖర్చయ్యిందని, వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల దిగుబడి రాలేదన్నారు. కేవలం మూడు బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని వివరించారు. ఖరీఫ్‌లో అన్నదాతలు పంట నష్టపోయారని, కరువును జయించాలంటే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకోవాలని కమిటీ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్ హితవు పలికారు. చిత్తూరు జిల్లాలో 16 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారని, అందులో మూడు మండలాలు మధ్యస్థ కరువు మండలాలుగా ఉన్నాయని, మిగిలిన మండలాల్లో తీవ్ర కరువు దృష్ట్యా రైతుల సంక్షేమం కోసం నష్టం అంచనా వేసేందుకు వచ్చామని చెప్పారు. సకాలంలో వర్షాలు పడకపోవడం వల్ల రైతులు నష్టపోయారని సభ్యులు అంచనాకు వచ్చారు. అనంతరం చిత్తూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కోనాపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో పశు సంవర్ధక, జలవనరుల, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కరువు సంబంధించిన ఫొటోలను చూపించారు. చిత్తూరు జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో వేరుశనగ పంట సాధారణ విస్తీర్ణం 43,174 హెక్టర్లు ఉండగా, 15546 హెక్టార్ల విస్తీర్ణంలోనే సాగు చేశారని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటగా ఉలవలు వేసుకునేందుకు 80 శాతం మంది రైతులకు 6324 క్వింటాళ్ల సరఫరా చేసామని తెలిపారు. కేంద్ర బందం కమిటీ సభ్యులు జిల్లా అధికారులతో గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలోని రైతులు వేరుశనగ విత్తనాలు 100 శాతం సబ్సిడీతో రైతులకు అందించాలని కోరారు. మరికొంతమంది రైతులు కరువు మండలంగా ప్రకటించడంతో పాటు పాడి పశువులకు పశుపోషణా శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కరువు నిర్ధారణ కమిటీ డైరెక్టర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ దీపాంకర్ సెట్, లైవ్ స్టాక్ అసిస్టెంట్ కమిషనర్ మన్నాజీ ఉపాధ్యాయ, వ్యవసాయ అధికారి మురళీక ష్ణ, ఆర్డీవో శ్రీనివాసులు, వెటర్నరీ జెడి ప్రభాకర్ పాల్గొన్నారు.

కరువు సాయంపై అన్నదాతల ఆశలు

నివేదికలతోనే సరి.. నష్టపరిహారం ఏది?

ప్రజాశక్తి - చిత్తూరు

ఖరీఫ్ పంట నష్ట పరిహారంపై జిల్లాలోని కరువు మండలాల రైతులు పంట నష్టపరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ పంట పై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల సంతోషం అడియాసలైంది. గత సంవత్సరం వర్షాలు సకాలంలో పడకపోవడంతో కనీసం ఖర్చుపెట్టిన దిగుబడి గాని రైతుల చేతికి అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 16 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ సంవత్సరంలో ఖరీఫ్ పంట వేసి నష్టపోయిన రైతుల జాబితాను వ్యవసాయ శాఖ అధికారుల సేకరించారు. జిల్లాలో 16 మండలాల్లో 24,342 మంది రైతులను గుర్తించారు. 9068.88 ఎకరాల్లో పంట నష్టం వాటిలిందని వ్యవసాయ అధికారులు గుర్తించారు. జిల్లా వ్యవసాయ అధికారులు 1542 లక్షల రూపాయలు నష్టపరిహారం అంచనా తయారుచేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలు నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు ఎలాంటి నిధులనూ మంజూరు చేయలేదు.

'కంది' పోయింది..!

- అంతర పంటల్లోనూ...అన్నదాతకు నిరాశే...!
- జిల్లాలో 807 హెక్టార్లలో ప్రత్యామ్నాయ సాగు

ప్రజాశక్తి - చిత్తూరు

చిత్తూరు జిల్లాలో ఖరీఫ్‌లో వేరుశనగ పంట పూర్తిగా నష్టపోయారు . వేరుశనగ పంటలో అంతర పంటగా వేసిన కంది, అనప, ఉద్దులు, పెసలు, కందులు పంటలైనా చేతికి వస్తుందని ఆశిస్తున్న రైతులకు నిరాశే మిగిలింది . చిత్తూరు జిల్లా పరిధిలో 31 మండలాల్లో కంది పంట 347 హెక్టార్లు, అలసందలు 20,047 హెక్టార్లు, అనప 146 హెక్టార్లు, ఉద్దులు 44 హెక్టార్లు, పెసలు 23 హెక్టార్లు కలిపి మొత్తంగా జిల్లాలో ఖరీఫ కు ప్రత్యామ్నాయంగా 807 హెక్టార్లలో అంతర పంటలు రైతులు వేశారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన వరుస తుపానుల ప్రభావంతో వర్షాల వల్ల కంది పంట ఏపుగా పెరిగింది. పూత మొగ్గ దశలో పంట వచ్చే క్రమంలో నవంబర్ నెలలో వర్షాలు పడడంతో తేమ ఎక్కువై అంతర పంటల్లో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. డిసెంబర్ నెలలో కూడా వర్షాలు పడడంతో కంది పంట గింజలు పుచ్చిపోయి దిగుబడి రాకుండా పోయింది. దీంతో వేరుశనగ పంటలో నష్టపోయినా, అంతర్ పంటల్లో దిగుబడి వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది.

వేరుశనగ పెట్టినా పెట్టుబడీ రాలేదు..

చిట్టిబాబు, యాదమరి మండలం

గత సంవత్సరం ఖరీఫ్ సీజన్లో వేరుశనగ పంట వేసాము. వేరుశెనగ పంట విత్తేందుకు, పొలం దున్నకము, విత్తుట, పొలంలో కలుపు తీయడం, వేరుశనగను ఒబిడి చేయటం ఇవన్నీ కలుపుకుంటే ఎకరాకు 25 వేల రూపాయల పైనే ఖర్చయ్యింది. గత సంవత్సరంలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో వేరుశనగ పంట చేతికందలేదు. ఎకరాకు 15 మూటలు రావలసిన వేరుశనగ కేవలం మూడు మూటలు మాత్రమే వచ్చింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాం.

ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలి

తంగమణి, కోనాపల్లి గ్రామం

వేరుశనగ పంటలో ప్రత్యామ్నాయ పంటగా వేసిన కందులు పంట చేతికొస్తుందని ఆశించాము. వర్షాల వల్ల పొలాల్లో కంది గింజలన్నీ పుచ్చులుగా ఉంది.. ఇటు వేరుశనగ, అటు కంది పంట కూడా చేతికి రాకుండా నష్టపోయాం. వేసేందుకు 20 వేలు అప్పు చేసి ఖర్చు పెట్టాం. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలి..

పశువులకు గడ్డి కేంద్రాలు పెట్టాలి :నర్రావూరు

యాదమరి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారు. ఓ వైపు కరువు కుదిపేస్తోంది. కనీసం పాడి రైతులకు పశువులకు గడ్డి పెంపకం కేంద్రాలుపెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

వర్షాల వల్లే అంతర పంటలు దెబ్బతిన్నాయి : చరిత్ర, యాదమరి వ్యవసాయ అధికారి

వేరుశనగ పంటల్లో వర్షాలు సకాలంలో పడకపోవడంతో వేరుశనగపంటలు రైతులు ఆశించిన దిగుబడి అందలేదు. అంతర పంటల్లో పూత దశలో వర్షాలు అధికంగా పడడంతో పంట ఏపుగాపెరిగాయి. మొగ్గ, కాయలు ఏర్పడే దశలో వర్షాలు అధికంగా పడడంతో పంట ఆశించిన దిగుబడి రాలేదు. గింజలు పుచ్చులుగా అధికంగా ఏర్పడి అంతర్‌పంటలో దిగుబడి రాలేకపోయింది. వేరుశనగ అంతరపంటల్లో నష్టపోయిన రైతులు వివరాలను సేకరించి ప్రభుత్వం దష్టికి నివేదిక పంపించాం.

నివేదికలు ప్రభుత్వానికి పంపించాం : మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి

కరువు అంచనా నివేదికలను ప్రభుత్వం దష్టికి పంపించాం. నష్టపరిహారం వచ్చిన వెంటనే రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం. బుధవారం యాదమరి మండలానికి విచ్చేసిన కేంద్ర బృందానికి వివరించాం.

ముచ్చటగా మూడు రోజులు ముగిసిన చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - కుప్పం టౌన్, రూరల్

కుప్పం నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల పర్యటన ముచ్చటగా ముగిసింది. రాష్ట్ర ముఖ్యమంత్రి సోమ, మంగళ, బుధ వారాలలో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం పట్టణం, మండల పరిధిలోని నడుమూరు, గుడుపల్లి మండల పరిధిలోని ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రాంతాలలో పర్యటించారు. సోమవారం పగలు 12 గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, విశ్వవిద్యాలయ ఆడిటోరియం వేదికగా స్వర్ణ కుప్పం విజన్ 2029 ప్రణాళికలను ఆవిష్కరించారు. అనంతరం కుప్పం మండలం నడుమూరు గ్రామంలో సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించి, పట్టణ పరిధిలోని శీగలపల్లి ప్రాంతంలో ప్రకతి వ్యవసాయ రైతులను అభినందించి, వ్యవసాయ భూములను పరిశీలించి, ప్రకతి వ్యవసాయాన్ని అభివద్ధి చేయడానికి ఒప్పందాలు సైతం కుదుర్చుకున్నారు. ఆపై ద్రావిడ విశ్వవిద్యాలయం చేరుకుని స్థానిక టిడిపి నాయకులతో సమావేశం ముగించుకుని, కుప్పం పట్టణంలోని రోడ్డు, భవనాల శాఖ అతిథి గహానికి చేరుకోవడంతో మొదటి రోజు పర్యటన ముగిసింది. రెండవ రోజు పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం టిడిపి కార్యాలయానికి చేరుకుని స్థానిక ప్రజల సౌకర్యార్థం జననాయకుడు పోర్టల్ ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం చేరుకుని పలు అభివద్ధి కార్యక్రమాలకు, సంస్థల స్థాపనకు శంకుస్థాపనలు గావించారు.

అలాగే నిరుద్యోగ నిర్మూలనకు పలు సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అక్కడి నుండి మండల పరిధిలోని కంగుంది గ్రామానికి చేరుకుని కీర్తిశేషులు శ్యామన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తిరిగి ద్రావిడ విశ్వవిద్యాలయానికి చేరుకుని పలు శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. అలాగే విశ్వవిద్యాలయం పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన భవనాలను ప్రారంభించారు. రెండవ రోజు కార్యక్రమాలను ముగించుకున్న ముఖ్యమంత్రి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ చేరుకుని తీసుకున్నారు. బుధవారం ఉదయం పలువురు లబ్ధిదారులను కలుసుకుని, వారి అభినందనలను స్వీకరించి, ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఇందిరాగాంధీ స్టేడియం కు చేరుకుని, పలువురు టిడిపి నాయకులు, అభిమానుల వీడ్కోలుతో తిరుగు ప్రయాణమయ్యారు.

ద్రావిడ వర్సిటీలో నూతన భవనం ప్రారంభించిన సిఎం

ద్రావిడ విశ్వ విద్యాలయంలో 10 కోట్ల రూసా 2.0 నిధులతో నిర్మించిన అత్యాధునిక ల్యాబ్స్, సెమినార్ హాలు కలిగిన విద్యార్థి తరగతుల భవనాన్ని, రూ.2.5 కోట్లతో నిర్మించిన విద్యార్థుల వసతి గృహాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంగళవారం ప్రారంభించారు. కడా ఆధ్వర్యంలో గ్రీన్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. కుప్పంలోని యువతీ యువకులకు శిక్షణ ఇప్పించి, ఉద్యోగ అవకాశాలు కల్పించడం స్కిల్ డెవలప్‌మెంట్ ఉద్దేశ్యం. ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి, రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్జీ ఇచ్చిన వెంటనే పరిష్కారం

సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన చలపతి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో మంగళవారం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వ్యవసాయ బోరుకు పంప్‌సెట్ కావాలని శాంతిపురం మండలం సోమాపురం గ్రామానికి చెందిన రైతు సి.చలపతి సిఎంకు అర్జీ ఇచ్చారు. సిఎం ఆదేశాల మేరకు అదేరోజు సాయంత్రం ఏడు గంటకల్లా ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ అధికారులు రైతు పొలంలో వ్యవసాయ బోరుకు 10హెచ్‌పి /30 పంపుసెట్ ఏర్పాటు చేసి నీరు అందించారు. బుధవారం ఆర్ అండ్ బి అతిథిగృహంలో ముఖ్యమంత్రిని లబ్దిదారుడు చలపతి కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'రూ.80వేలు అప్పుచేసి పొలంలో బోరు వేశానని, డబ్బు సరిపోక పంప్‌సెట్ వేయించలేకపోయానని, పంట మొత్తం ఎండిపోయిందని, ఈనెల ఏడో తేదీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కుప్పంలో అర్జీ సమర్పించగా, సిఎం ఆదేశాలతో అధికారులు అదేరోజు రాత్రి ఏడు గంటలకు పంపుసెట్ బిగించి పొలానికి నీరు అందించారని, నా ఆనందాన్ని అవధుల్లేవని, సిఎం చంద్రబాబు తనపాలిట దేవుడు' అని అభిమానాన్ని చాటుకున్నారు. సిఎం సమక్షంలో కుప్పం నియోజకవర్గ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సంతోష్‌కుమార్, వీరబ్రహ్మం మునిమనవడు వీరంభట్ల స్వామితో కలిసి కాలజ్ఞానం బోధించిన వీరబ్రహ్మం క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు తెలిపారు.

ఆలయ అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి - పుంగనూరు

పట్టణ నడిబొడ్డున వెలసి ఉన్న భోగ నంజుండేశ్వర స్వామి ఆలయానికి ఆనుకోని ఉన్న స్థలం లో ఎండోమెంట్ అధికారులు నిర్మాణాలు చేస్తుంటే, మున్సిపల్ అధికారులు బుధవారం కట్టడాలు అక్రమమని కూల్చడం పట్టణంలో చర్చనీయాంశమయ్యింది. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న రెండు గుంటల (2178 అడుగులు)స్థలంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మించాలని ఎండోమెంట్ అధికారులు నిర్మాణాలు చేపట్టారు. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు పట్టణానికి చెందిన ఓ బడా నాయకుడు బినామీ డాక్యుమెంట్లతో, సంబంధం లేని సర్వే నెంబర్ వేసి అమ్మకాలు చేపట్టారని, దీనిపై ఎండోమెంట్ అధికారులు చర్యలు తీసుకుని కోర్టుకు వెళ్లడం జరిగింది. ఇది ఎండోమెంటుకు సంబంధించిన స్థలమని తేల్చడంతో అధికారులు ప్రహరీ ఏర్పాటు చేసుకున్నారు. ఖాళీగా వదిలేస్తే కబ్జా కు మళ్ళీ గురి అవుతుందని పట్టణం నడిబొడ్డున వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తే ఆలయ అభివద్ధికి ఉపయోగపడుతుందని ఎండోమెంట్ అధికారులు నిర్మాణాలు చేపట్టారు. అయితే రాజకీయ ముసుగులో తిరిగి వారే కైవసం చేసుకోవాలని రకరకాల ఎత్తుగడులు వేస్తున్నారని పట్టణంలో విమర్శలు వినవస్తున్నాయి. దీనికి తెలుగుదేశం పార్టీలో ఓ గ్రూపు మద్దతు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గత 15 రోజులుగా ఎండోమెంట్ అధికారులు ఆ స్థలంలో నిర్మాణాలు ప్రారంభించారు. వ్యతిరేక గ్రూపు మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో టిపిఓ సిబ్బందిని పంపి నిర్మిస్తున్న కట్టడాలను కూల్చివేశారు. సంఘటన తెలిసిన వెంటనే పట్టణ ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు.

చట్ట ప్రకారమే చేస్తున్నాం : మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

భోగం నంజుండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న కట్టడాలకు ప్లాన్ అప్రూవల్ మున్సిపాలిటీ నుంచి లేదు. ఈ కారణంగా అక్రమ కట్టడాలను కూల్చి వేస్తూ నిర్మాణాలు ఆపాలని ఆదేశాలు ఇచ్చాం. కేసు కోర్టులో పెండింగ్ ఉంది. ఖాళీ స్థలంలో నిర్మాణానికి కోర్టు అనుమతులు వచ్చిన తరువాత నిర్మించుకోవచ్చు. అప్పటివరకూ నిలిపేయాలని ఆదేశాలు ఇచ్చాం.

పల్లెలను కప్పేసిన మంచు దుప్పటి!

పల్లెలను కప్పేసిన దట్టమైన మంచు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పచ్చని పంట పొలాలు, చుట్టూ కొండలు పొద్దు పొద్దున్నే కోడి కూతలు.. వీటికి తోడు పల్లెలను పొగ మంచు దట్టంగా కమ్మేసింది. బుధవారం ఉదయం 8.30 గంటలవుతున్నా వదలని మంచు..ఆ తర్వాత ఆకాశాన్ని చీల్చుకుంటూ ఉదయించిన సూర్యకిరణాలు చూపరులను ఆకట్టుకుంది. గంగాధర నెల్లూరు మండలం లోని తూగుండ్రం వద్ద ఆవల కొండ మంచు ఆహ్లాదకరమైన వాతావరణ ప్రకృతి ప్రేమికులను కనువిందు చేసింది.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి: ఎంఈఓ

మాట్లాడుతున్న ఎంఈవో శివరత్నమ్మ

ప్రజాశక్తి -సోమల : మండలంలోని పది ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు బాగా చదివి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో మండలానికి మంచి ఫలితాలు వచ్చేలా ఆయా పాఠశాలల్లో అందరూ ఉత్తీర్ణులయ్యే లా కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారిణి శివరత్నమ్మ కోరారు. బుధవారం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వందరోజుల ప్రణాళికను బుధవారం ఆమె పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు అందించారు. విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను మరింతగా చదివి పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి- సోమల: రాష్ట్ర ప్రభుత్వం అనర్హులను ఏరి వేసేందుకు చేపట్టిన పింఛన్ల తనిఖీ మండలంలో మూడు రోజులుగా సాగుతోంది. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వైద్యులు, సచివాలయ సిబ్బంది 15 వేల రూపాయల పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, పింఛనుకు అర్హులేనా? అని పరిశీలించి నివేదికలను ఆన్‌లైనులో నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కందూరు, వల్లిగట్ల, తమ్మి నాయుని పల్లి, నెల్లిమంద తదితర పంచాయతీలలో తనిఖీ బృందం పింఛన్ల తనిఖీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో నారాయణ, పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పరిశీలించారు. మండలంలోని మిగిలిన పంచాయతీలలో తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యార్థినికి నగదు పురస్కారం

విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నంజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఎన్ నికిత డిస్క్‌త్రో విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ వంతు ప్రోత్సాహక బహుమతిగా ఆరువేల రూపాయలు ఎస్ఎంసి ఛైర్మన్ ఇమ్రాన్ ద్వారా నగదు అందించారు. మరొక పూర్వ విద్యార్థి అనుభేగ్ రెండు వేల రూపాయలు విద్యార్థినికి ప్రోత్సాహకంగా అందించారు. జాతీయ స్థాయి డిస్క్‌త్రో పోటీలలో పాల్గొని విద్యార్థిని తన ప్రతిభను చూపించి మండలానికి, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాత లు తీసుకురావాలని దాతలు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు కుసుమాంబ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు: డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ పై పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు పలమనేరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాయలసీమ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి బివియం శివశంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి 'జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్'అంటూ నినాదాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రాసిన దైవ సమానులైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి హోం మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేసి, బడుగు బలహీన వర్గాల వారికి క్షమాపణలు చెప్పాలని తెలిపారు . ఈ కార్యక్రమంలో చిత్తూరు డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్, చిత్తూరు డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్, దొరస్వామి, శంకర్ -పి రహీం ఖాన్ తోపాటు మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

ప్రజాశక్తి -గంగవరం: జాతీయ ఉపాధి హామీ పనుల నిర్వహణలో భాగంగా గంగవరం మండల అభివృద్ధి కార్యాలయం ఆవరణలో గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి నాలుగు 2023 నుండి 2024, మార్చి 31 మధ్య జరిగిన ఉపాధి హామీ పనులు వేతనాలు అభివృద్ధి కార్యక్రమాలపై బహిరంగ తనిఖీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు వారాలుగా సామాజిక తనిఖీ నిర్వహించాలని సమగ్ర సమాచారాన్ని ఏ పంచాయతీలో జరిగిన పనులు వాటి స్థితిలో స్థితిగతుల గురించి చర్చలు ఉంటాయని ఆయన తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన అన్నారు.

ముగిసిన అథ్లెటిక్ పోటీలు

అథ్లెటిక్ పోటీలలో విజేతలు

ప్రజాశక్తి-చౌడేపల్లి: మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్ల ఉన్నత పాఠశాల సమీపంలో నిర్వహిస్తున్న అథ్లెటిక్ పోటీలు బుధవారం ముగిశాయి. పుంగనూరు జోనల్ స్థాయిలో జరిగిన ఈ క్రీడల్లో ఆరు మండలాలకు చెందిన 400 మంది అథ్లెటిక్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం నుంచి ప్రారంభమైన ఈ క్రీడల్లో పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో వారి ప్రతిభను కనబరిచారు గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కేశవరెడ్డి, తిరుమలమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ మనోహర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, సీనియర్ విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయుడు రామచంద్ర, పీడీ వెంకటేష్, కరుణాకర్, చిన్నప్ప, రాజేంద్ర, నితిన్, ఉమా, శారద, నీలవేణి, మృదుల, స్థానిక గ్రామస్తులు వినోద్ కుమార్ రెడ్డి, తిరుమనీపల్లి బాబు రెడ్డి, పుదిపట్ల బాబు రెడ్డి క్రీడాకారులు, ప్రోత్సాహకులు పాల్గొన్నారు.

నేడు బోయకొండ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ అధికార సిబ్బంది అర్చకులు, బ్యాంకు, పోలీసు సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

మోడీ మహా మోసం

విశాఖ పర్యటనపై సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ పర్యటన సందర్భంగా విశాఖ స్టీలుపై రాష్ట్ర ప్రజలమనోభావాలను ఏమాత్రం గౌరవించకుండా మరోసారి మోసం చేశారని, రాష్ట్ర ప్రజలుతీవ్ర ఆందోళన చెందుతున్నా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై ప్రధాని ఒక్కమాట కూడా మాట్లాడకపోవడాన్ని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని తన సుదీర్ఘ ప్రసంగంలో ఈ రోజు శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల గురించి గొప్పగా చెప్పారే తప్ప గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రత్యేక హోదా గురించి ఉత్తరాంధ్ర, రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీల గురించి ప్రధాని మాట్లాడకపోవడం రాష్ట్ర ప్రజలను వంచించడమే అన్నారు. విశాఖ ఉక్కును కాపాడి తీరుతామని ప్రగల్భాలు పలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కూడా ఈ వేదిక నుండి ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ గురించి చంద్రబాబు విన్నపాలు చేశారే తప్ప, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చెప్పకపోవడం దారుణం అన్నారు .ఆ సభలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం 'విశాఖ ఉక్కు' గురించి ప్రస్తావించకపోవడం చిత్తశుద్ధిలేమికి నిదర్శనం అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం రద్దు, స్వంత గనుల కేటాయింపు, సెయిల్‌లో విలీనం సమస్యలపై ప్రధాని ప్రకటన చేస్తారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రధానితో ఈ ప్రకటన చేయిస్తారని స్టీల్ కార్మికులు, విశాఖ ప్రజలు ఎదురు చూశారు. కానీ వీరు ప్రజల ఆశలను వమ్ము చేయడం దుర్మార్గం అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లకు పైగా పట్టుదలగా పోరాడుతున్న విశాఖ ఉక్కు కార్మికులు, వారికి సంఘీభావంగా నిలుస్తున్న రాష్ట్ర ప్రజలు మరింత బలమైన ఉద్యమం సాగిస్తేనే పాలకుల మెడలు వంచడం సాధ్యమవుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించండి

అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

ముఖ్యమంత్రికి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : సమస్యలు వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అర్జీ అందుకున్న వెంటనే సమస్యకు పరిష్కారం చూపారంటూ కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం సోమాపురం గ్రామానికి చెందిన రైతు సి.చలపతి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పట్టణంలోని రోడ్డు, భవనాల శాఖ అతిథి గృహంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య రైతు అయిన తను 80 వేల రూపాయలు అప్పుచేసి బోరు బావి తవ్వానని ఈ బోరుకు మోటారు ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేక, పంటలు ఎండిపోతున్న తరుణంలో జన నాయకుడు కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రికి తన సమస్యను అర్జీ రూపంలో అందించారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి సమస్య పరిష్కారానికి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డిఎంఅండ్‌హెచ్‌వో

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బైరెడ్డిపల్లిలో బుధవారం జిల్లా వైద్య అధికారిణి డి టి సుధారాణి బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. డాక్టర్లు, సిబ్బంది, సమయపాలన పాటించాలన్నారు. అనంతరం అక్కడికి వచ్చిన స్థానికులు తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 104 వాహనం, బుధవారం నాచుకుప్పం గ్రామంలో డాక్టర్ లేక గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు చేయగా డిఎంఅండ్ హెచ్‌వో మాట్లాడుతూ రామకుప్పంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు తీర్థం పరిధిలో ఉన్న డాక్టర్ అరుణ్ కుమార్ వెళ్లారని, పద్మావతి పలమనేరు హాస్పిటల్ అధికారుల ఆదేశాల మేరకు వెళుతున్నారని వారిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 104 వాహనం ద్వారా సేవలందించేందుకు చర్యలు చేపడతామని ఆమె భరోసా ఇచ్చారు.అనంతరం బైరెడ్డి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ పనితీరు, ఆన్‌లైనులో అప్‌లోడ్ అయిన పేషెంట్ వివరాలు, అక్కడికొచ్చిన పేషెంట్లతో ఇబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ అరుణ కుమార్, సూపరువైజర్, పిహెచ్ఓ, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి డిడిటి సుధారాణి, వాణి, డాక్టర్ విజయచంద్ర, ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహాయం మరువలేనిది..!

రహదారి గుంతల పూడ్చిన దాతకు ప్రశంస

రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న దాతలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: 'ఇక్కడ గుంతలు ఉన్నాయి.. ఎవరైనా పడిపోతారు... దెబ్బలు తగులుతాయి.. ఎన్నోచోట్ల ప్రాణ నష్టం జరిగింది. ఆ లోటును ఎవ్వరూ తీర్చలేరు...' తెలిసిన చాలా మంది మదిలో తలుచుకుంటూ చూస్తూ నే వెళ్లిపోతారు. కొంతమంది మాత్రమే స్పందించి 'ఎవరైనా పడిపోతారు.. ప్రయాణికులకు ఇబ్బంది కలుగుతుంది.. మనం ఈ రోడ్డును బాగు చేద్దాం.. సంబంధిత అధికారులు పట్టించుకోరు.. మన వల్ల అయినా సహాయం చేద్దాం' అని మంచి మనసుతో సొంత ఖర్చులతో ఆ రోడ్డు గుంతలను పూడ్చి , వాహన చోదకులకు, ప్రయాణికులకు, పాదచారులకు ఇబ్బందులు కలగకుండా చేశారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం గ్రామం సమీపంలో ఎర్రగుంట కనం దగ్గర ఆర్అండ్‌బి రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. అక్కడికి వచ్చే కొద్దికి బస్సు నడిపే డ్రైవర్లు, టిప్పర్ డ్రైవర్లు, ద్విచక్ర వాహన దారులు, చాలా ఇబ్బందులు పడేవారు. కొన్ని సమయాల్లో కార్లు కింద భాగం రోడ్డుకు రాసుకొని ఆయిల్ పైపులు కట్ అవడం, లేక గేర్ బాక్స్ పగిలి పోవడం ఇలాంటివి చోటు చేసుకునేవి. ఇవి గమనించిన పచ్చికా పల్లం గ్రామానికి చెందిన సువ్వాల ఆనంద రెడ్డి, మొరవ గ్రామానికి తెలిసిన తులసి, అతని స్నేహితులు కలిసి బుధవారం జెసిపిని తెప్పించి సొంత నిధుల తో రోడ్డుపై పారుతున్న నీళ్లను పక్కకు మళ్లించి ఆ గుంతలకు మట్టితో నింపి చదును చేశారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా చేశారు. వీరి సేవా గుణాన్ని పలువురు మండల నాయకులు, ప్రజలు ప్రశంసించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించండి

రెవెన్యూ గ్రామ సభలో ప్రజల వినతి

రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సు ఎస్ఆర్ పురం మండలంలో చివరి రోజు ముద్దికుప్పం పంచాయతీ చొక్కామడుగు గ్రామంలో చెరువులు , గుట్ట ప్రభుత్వ భూముల ఆక్రమణ తొలగించాలని ఎన్టీఆర్ కాలనీకి శ్మశానం కోసం స్థలం కేటాయించాలని బుధవారం రెవెన్యూ గ్రామ సభలో డిప్యూటీ తహశీల్దారు రవికుమార్‌కు గ్రామ ప్రజలు వినతి పత్రం అందించారు. గతంలో రెవెన్యూ సమస్యల పరిష్కార సభ నిర్వహించినప్పుడు ఈ విషయాన్ని చొక్కామడుగు ఎన్టీఆర్ కాలనీ ప్రజలు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ కి అర్జీ రూపంగా విన్నవించారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అప్పటి తహశీల్దారు అమర్నాథ్‌ను ఆదేశించారని కానీ ఫలితం లేదన్నారు. గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ కాలనీకి శ్మశాన స్థలం కేటాయించినట్లు అధికారులు చెప్పినా శ్మశానానికి స్థలం మాత్రం కొలిచి చూపించలేదన్నారు. శ్మశానం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థలం కేటాయించాలని ప్రజలు కోరారు. గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ సెల్ నాయకుడు కుమార్, టిడిపి నాయకులు రెవెన్యూ సదస్సులో రెవెన్యూ సిబ్బందిని కోరారు. గతంలో సమస్యలను ఎమ్మెల్యే సమక్షంలో అధికారులు దృష్టికి తీసుకున్న విషయం మరోసారి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు రవికుమార్ , ఆర్ ఐ ప్రభాకర్, వీఆర్‌వో లు, స్థానిక నాయకులు , టిడిపి జిల్లా నాయకుడు కుమార్ పాల్గొన్నారు.

డానియల్‌కు పరామర్శ

వైసిపి నాయకుడిని పరామర్శిస్తున్న విజయానందరెడ్డి

ప్రజాశక్తి -గుడిపాల: మండలం సీనియర్ వైసిపి నాయకుడు , ఎంపిటిసి డానియల్ ని వైసీపి ఇంచార్జ్ విజయానందరెడ్డి పరామర్శించారు . ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేసుకున్న డానియల్ ని బుధవారం బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డు శ్రీనివాస నగర్ లోని ఆయన స్వగృహంలో కలిసి విజయానంద రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా విజయానంద రెడ్డి గారు డానియల్ గారికి, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. డానియల్ గారిని కలిసిన వారిలో మండల నాయకులు రాసనపల్లి ప్రకాష్, మధు రాయల్, రజనీ కాంత్, మధు రెడ్డి, ప్రసాద్ రెడ్డి, చిట్టిబాబు, కేపీ శ్రీధర్, నాయకులు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి రామయ్య తన వంతు తోడ్పడుతో విద్యా మెటీరియల్ పంపిణీ చేయడం అభినందనీయమని జరిగిన హెడ్మాస్టర్ హేమలత పేర్కొన్నారు. గంగాధర నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పూర్వ విద్యార్థి గంగాధర నెల్లూరు కు చెందిన కలవకుంట రామయ్య 20 వేల రూపాయల విలువగల స్టడీ మెటీరియల్ ను అతని భార్య డిల్లీ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి రామయ్య భార్య డిల్లీ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలన్న ఉద్దేశంతో కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హెచ్ ఎం దినకర్, పాటు విద్యార్థిని విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి

యర్రావారిపాలెంలో శిక్షణ ఇస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నాగలాపురం: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో బాలాజీ నాయక్ పేర్కొన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై కిశోర బాలికలకు ఐసిడిఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నాగలాపురం ఎంపిడివో కార్యాలయ ఆవరణలో బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవో బాబయ్య, పిచ్చాటూరు సిడిపిఓ శోభారాణి, ప్రధానోపాధ్యాయులు కస్తూరయ్య, ముని సుబ్రహ్మణ్యం, ఏపిఎం సీతారామయ్య పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఎంపీడీవో బాలాజీ నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయసులో వివాహలు చేయడం వల్ల మానసికంగా, శారీరకం ఎదురయ్యే సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం: మండల కేంద్రంలోని శ్రీ శక్తి కార్యాలయంలో చంద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంకు కిశోర వికాసంపై బుధవారం శిక్షణ నిర్వ హించారు. ఐసిడిఎస్ అధికారి ప్రదీప మాట్లా డుతూ ప్రస్తుతం పిల్ల లకు కిశోర వికాసం చాలా అవ సరమని పిల్ల లను మంచి పౌరు లుగా తీర్చి దిద్దే బాధ్య త అందపై ఉందని పేర్కొన్నారు. చిన్న వయసులోనే పిల్లలు సైబర్ క్రైమ్ బారిన పడి మత్తు పదార్థాలకు అలవాటు పడి వారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలు నుండి పిల్లల ఆలోచనలో అలవాట్లలో మార్పు తేవాలని ఎంపీడీవో అరుణ అన్నారు. యుక్త వయసు పిల్లలకు సామాజిక మాధ్యమాలను దూరంగా ఉంచి తన భవిష్యత్తుకు, తన కుటుంబానికి, సమాజానికి ఉపయోగపడే విధంగా ఆలోచనలు ఉండేల తీర్చిదిద్దాలని ఎమ్మార్వో పరమేశ్వర స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఎంఈఓ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కారమే ధ్యేయం: తహశీల్దారు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్ద చెల్లార గుంట రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ గ్రామ సదస్సు మండల తహశీల్దార్ మాధవ రాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రెవెన్యూ సదస్సుల కార్యక్రమం రైతులకు సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులు వారి సమస్యలను వారి వద్ద ఉన్న రికార్డులను అర్జీల రూపంలో రెవెన్యూ అధికారులకు తెలిపితే పాత రికార్డులను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.రెవెన్యూ సదస్సులో 66 వినతులు అధ్యయనం వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరెడ్డి, జయచంద్రప్రకాష్, హిమగిరి రెడ్డి, మహేశ్వర్ రెడ్డి కె.వి. నాగరాజ్ .కే .ఎస్ .సుబ్రమణ్యం ,వి. గంగాధర్ రెడ్డి, సి .షణ్ముగం ,అశ్వత నారాయణ ,రెవెన్యూ సిబ్బంది, నాయకులు, రైతులు అనేక మంది పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో గురుశక్తి సౌందర్యమ్మ ఆధ్వర్యంలో ఓం శక్తి భక్తులకు బుధవారం అన్నదానం నిర్వహించారు. ఉదయం ఓం శక్తి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. గురువారం తమిళనాడు మేలు మరువత్తూర్ లోని ఓం శక్తి ఆలయంలో ఇరుముడి చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంజును సన్మానిస్తున్న దృశ్యం

దాతకు ఘన సన్మానం

ప్రజాశక్తి-చౌడేపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భవనానికి మైక్ సెట్ అందించిన దాతను పలువురు సన్మానించారు. అంబేద్కర్ భవన నిర్మాణ వ్యవస్థాపకులు బ్యాంకు రెడ్డప్ప ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో దాత కర్ణాటక రాష్ట్రం శ్రీనివాస్ పురం తాలూకా పులగూర కోటకు చెందిన మంజును దుశ్శాలువతో బుధవారం సన్మానించారు ఈ కార్యక్రమంలో నాయకులు కూరపర్తి శ్రీనివాసులు, సుకుమార్, హాస్టల్ వార్డెన్ సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి: ఏపీడీ

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని క్లస్టర్ ఏపీడీ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డిలు పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరులో బుధవారం ఉపాధి హామీ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారం పాండ్లు, రింగ్ ట్రెంచ్ కటింగ్‌లు, అమృత సరోవర్ పనులను చేసుకోవచ్చన్నారు. ఉపాధి హామీ పనికి వచ్చే కూలీకి రోజు కీ రూ.300లు వచ్చే విధంగా పనిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధి హామీ ఎపీవో శ్రీనివాసులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి కళ్యాణోత్సవం

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరులో స్థానిక కనకదుర్గ నగర్‌లో వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద కాణిపాకం నుంచి విచ్చేసిన దేవస్థానం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కాణిపాక సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామికల్యాణోత్సవం బుధవారం శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. పలమనేరు పుర ప్రముఖులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆర్‌డిఎంఏ విశ్వనాథ్‌కు అభినందనలు తెలుపుతున్న అధికారులుల

ఆర్‌డిఎంఏగా విశ్వనాథ్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కమిషనర్, చూడ కమిషనర్ గా పనిచేసిన పులిగుండు విశ్వనాథ్ ఉద్యోగోన్నతి పై ఆర్డిఎంఏ గా నియమితులయ్యారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చిన విశ్వనాథ్ ను మర్యాద పూర్వకంగా కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర కలసి అభినందనలు తెలిపారు.

హామీలు తక్షణమే అమలు చేయాలి: సిపిఎం

ప్రజాశక్తి -కోట : రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోట మండల సిపిఎం నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాని మోడీ వచ్చిన సందర్భంగా సిపిఎం కోట కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సిపిఎం నాయకులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలును ఒక్కటి అమలు చేయకపోవడం విడ్డూరంగా వుందన్నారు. లక్ష కోట్లు విలువ చేసే విశాఖ ఉక్కు అదాని, అంబానీకి ప్రవేటు పరం చేశారని దీంతోపాటు కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయిస్తామని గతంలో హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు. వెంటనే హామీలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమణయ్య, నాగరాజు, బాలయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

నెమలిని రక్షించిన యువకులు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం : ప్రమాదానికి గురైన నెమలిని యువకులు రక్షించిన సంఘటన బుధవారం మండలంలోని బోడబండ క్రాస్ లో చోటు చేసుకుంది. నలగంపల్లి గ్రామానికి చెందిన యువకులు ప్రభాకర్, గౌతమ్ , జాన్సన్ సూర్య బాలు, సంతోష్, యువకులు ప్రమాదానికి గురైన నెమలిని గుర్తించి దానికి ప్రథమ చికిత్స చేపట్టి అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు. అటవీ శాఖ సిబ్బంది మెరుగైన చికిత్స కోసం చిత్తూరు పశు వైద్య కేంద్రానికి తరలించి చికిత్సలు చేపట్టినట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

LOSS OF DOCUMENTS

AJJAMAREDDYPALLI VENKATRAMANA, S/o A.MUNUSWAMY Residing at D.NO:1-45, Raganipalle, Chedalla village Punganur Mandal,Chitoor district AP-517247. Here with declare that I have lost original sale deed document bearing no 4672/2011 at my house shifting, If any one found please contact above address .today onwards I used to certificates copies sale deed documents for my property transaction.If any one found and used that above original documents become illegal and void transaction and my self taking loan from "VERITAS FINANCE" Madanapalle Branch by pledging my C/copy of sale deed
Doc.No: 4672/2011.